'తల్లికి వందనం' ఇచ్చేలా లేరు



కూటమి నాయకులు ఇచ్చిన హామీలు గాల్లో తేలియాడుతున్నాయి. తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పారు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఏటా రూ.15 వేలు ఇస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తవుతున్నా ఆ ప్రస్తావనే లేదు. నాకు ఇద్దరు పిల్లలకీ రూ.30 వేలు రావాలి. ఇంత మోసం చేస్తారనుకోలేదు. గత ప్రభుత్వంలో జూలై నెలలోనే అమ్మఒడి సాయం అందించేశారు. – ఎస్.రజిని, కంచరపాలెం

నిరుద్యోగుల తిరుగుబాటు తప్పదు



ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తవుతున్నా ఆ విషయం పట్టించుకోవడం లేదు. ఉద్యోగాలు కల్పించండి.. లేకపోతే నిరుద్యోగ భృతి రూ.3 వేలు కచ్చితంగా ఇవ్వాల్సిందే. పాలకులు స్పందించకుంటే నిరుద్యోగులు తిరగబడతారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లడం దారుణం. – జి.గిరీష్, నిరుద్యోగి, ఇందిరానగర్

సిలిండర్ల కోసం ఎదురుచూస్తున్నాం



ప్రతి ఇంటికీ కచ్చితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఓట్లు కోసం ఈ హామీపై విస్తృతంగా ప్రచారం చేశారు. అందరం నమ్మి ఓట్లు వేశాం. ఇప్పుడు ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ఎదురు చూస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇంత వరకు నెరవేర్చలేదు. త్వరగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. – మాణిక్యల సుజాత, నక్కవానిపాలెం

ప్రతి నెలా రూ.1,500 ఇవ్వాల్సిందే..




సార్వత్రిక ఎన్నికల్లో గెలిపిస్తే సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామంటూ ప్రచార సభలు, సమావేశాల్లో కూటమి నేతలు ఊదరగొట్టారు. మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని ప్రచారం హోరెత్తించారు. తీరా అందలం ఎక్కాక ఆ ఊసే లేకుండా పోతోంది. ఎన్నికల్లో గెలిచాక.. ఇచ్చిన హామీలు మరచిపోతే ఎలా. నాతోపాటు మహిళలందరూ రూ.1,500 ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఇవ్వకపోతే మహిళల తిరుగుబాటు తప్పదు. – ఎం.స్వర్ణలత, గవర, కంచరపాలెం

ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు?



కూటమి ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు పూర్తయింది. అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. నేటి వరకు దాని గురించి ఎవరూ మాట్లాడటం లేదు. మేమంతా ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి. – పాతపట్నం అనురాధ, మురళీనగర్



చంద్రబాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

నమ్మి ఓట్లేశాం... నట్టేట ముంచొద్దు బాబూ...


హామీలన్నీ అమలు చేయండి




2024 ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ప్రస్తుత ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు చేసిన పోస్ట్

నీకు రూ.15 వేలు... నీకు రూ.15 వేలు.. నీకు.. నీకు... ఇంటిలో ఎందరు పిల్లలు చదివితే అందరికీ 'తల్లికి వందనం' పేరుతో రూ.15 వేలు చొప్పున అందజేస్తాం.. అమ్మకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు బ్యాంకు ఖాతాలోనే వేసేస్తాం... మీ ఇంటికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇచ్చేస్తాం... మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం... నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగభృతి చెల్లిస్తాం... రైతులందరికీ అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు చొప్పున అందజేస్తాం... అధికారంలోకి రాగానే ఈ సూపర్ సిక్స్ పథకాలన్నీ పక్కాగా అమలు చేసేస్తాం అంటూ ఎన్నికల సమయంలో ఇంటింటికీ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి ప్రచారంలో ఉదరగొట్టారు... కూటమి నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తో సహా స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్ రాజు మాయా మేనిఫెస్టోను ప్రజలకు చూపించి ఓట్లు అభ్యర్థించారు.. ఆ హామీలన్నీ జనం నమ్మి ఓట్లేసి అధికారం కట్టబెట్టేసరికి... పథకాలు అమలు చేయాలంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేతులెత్తేస్తుండడం గమనార్హం... ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తుండడంతో 'తల్లికి వందనం' సాయం రూ.15 వేల కోసం తల్లులు ఆశగా ఎదురు చూస్తున్నా... అందించే నాథుడు కనుచూపుమేరలో కనిపించడం లేదు... గత ఐదేళ్లలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలన్నీ పక్కాగా అమలు చేశారని... ఆర్థికంగా అండగా నిలిచారని లబ్ధిదారులు గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు మాత్రం అందుకు పూర్తి భిన్నమని... బాబు ష్యూరిటీ ఇస్తే... గ్యారెంటీ లేదని.. నమ్మిన జనాన్ని మోసం చేయడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య అని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.


– సీతంపేట/సీతమ్మధార/కంచరపాలెం/తాటిచెట్లపాలెం/మర్రిపాలెం











ఎన్నికల హామీలన్నీ అమలు చేయాల్సిందే



నిత్యం పెరుగుతున్న ధరలతో సతమతమవుతున్నాం. కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ప్రభుత్వం వచ్చి వంద రోజులు పూర్తవుతున్నా పథకాలు అమలు చేయలేదు. అవి ఎప్పుడు అమలు చేస్తారో అర్థం కావడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి. వేగంగా గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. తల్లికి వందనం, ఉచిత ప్రయాణం, ఇతర పథకాలు కూడా అమలు చేయాలి. – టి.మహేశ్వరి, నక్కవానిపాలెం

పిల్లల డబ్బుల కోసం ఎదురుచూపులు



కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు వంద రోజులవుతోంది. గత ప్రభుత్వం స్కూల్ తెరిచే నాటికి అమ్మ ఒడి నిధులు తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేసేవారు. కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదు. ఎంతమంది ఉన్నా అందరికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారు. నాకు ఇద్దరు పిల్లలు. వీరికి రూ.30 వేలు వస్తాయని ఎదురుచూస్తున్నా. ఈ ఏడాదికి ఇవ్వరని కొందరంటున్నారు. ఏమి చేస్తారో అని వేచి చూస్తున్నాం. – టి.అనూష, సాలగ్రామపురం

నిరుద్యోగ భృతి కోసం నిరీక్షణ



కూటమి ప్రభుత్వం రాగానే నిరుద్యోగులందరికీ ప్రతి నెలా 3.వేలు నిరుద్యోగ భృతి అందజేస్తామన్నారు. లేదా ఇంటికో ఉద్యోగం ఇస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులవుతున్నా నేటికీ భృతి ఇవ్వడం లేదు. ఆ ఊసే మరిచిపోయారు. ఎప్పుడిస్తారో కూడా తెలియడం లేదు. నాలాంటి నిరుద్యోగులు ఎంతో మంది ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. – పి.సౌజన్య, కైలాసపురం

ఉచిత బస్సు ప్రయాణం హుళక్కేనా...



చంద్రబాబు అన్నీ అబద్ధాలే చెబుతారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. తీరా నమ్మి ఓట్లేసిన మహిళలకు ఇంతవరకు ఉచిత బస్సు ప్రయాణం గురించి ఏ విధమైన ప్రకటన చేయడం లేదు. అమలు చేస్తారన్న నమ్మకం పోయింది. అయినా ఆశగా ఎదురుచూస్తున్నాం. ఈ హామీని అసలు అమలు చేస్తారో లేదో వెంటనే చెప్పండి. – బగాది సుజాత, గృహిణి, మాన్యం

కుమారుడి మరణం తట్టుకోలేక తల్లి బలవన్మరణం

సీతమ్మధార : కుమారుడు మృతి చెందడంతో మనస్తాపానికి గురైన తల్లి మెట్ల మార్గంలో ఉన్న ఐరన్ గ్రిల్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో కుమారుడు వేంకటేశ్వరరెడ్డితో కలిసి తవుడమ్మ (75) నివసించేవారు. ఈ నెల 15న వేంకటేశ్వరరెడ్డి గుండెపోటుతో మరణించాడు. కుమారుడి మరణం తట్టుకోలేక తల్లి తవుడమ్మ బుధవారం రాత్రి టెర్రస్ పైకి ఎక్కే మార్గంలో ఐరన్ రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఫోర్తుటౌన్ ఎస్ఐ ప్రమీల, ఎస్ఐ వెంకటరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

మర్రిపాలెం : రెడ్డి కంచరపాలెం ప్రాంతంలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భర్త దేవాది రాజేష్, ఇద్దరు కుమారులతో కలిసి దేవాది కుసుమ (35) రెడ్డి కంచరపాలెంలో నివసించేవారు. భార్యభర్తలు కలిసి డ్రై క్లినిక్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగించేవారు. అయితే భర్తపై అనుమానంతో కుసుమ తరచూ రాజేష్‌తో గొడవపడేది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భర్తతో గొడవపడిన తర్వాత అందరూ నిద్రకు ఉపక్రమించారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో కుటుంబ సభ్యులు నిద్ర లేచి చూడగా... బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కుసుమ ఆత్మహత్య చేసుకుని కనిపించింది. వేపగుంట ప్రాంతానికి చెందిన మృతురాలి సోదరుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవునికి పౌర్ణమి పూజలు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాద్రపద పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. ఆర్జిత సేవలో పాల్గొన్న భక్తులలు ఆలయ ప్రదక్షిణ చేశారు. వేద మంత్రోచ్ఛరణ మధ్య అభిషేకం నిర్వహించారు. అనంతరం వైభవ వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తహసీల్దార్ కార్యాలయంలో పాము కలకలం



పట్టుకున్న పాముతో స్నేక్ క్యాచర్ కిరణ్

సీతమ్మధార : సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో ఓ పాము కలకలం రేపింది. దీంతో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది భయంతో పరుగులు తీశారు. బుధవారం ఉదయం యథావిధిగా ఉద్యోగులంతా తహసీల్దార్ కార్యాలయంలో విధులకు హాజరయ్యారు. ఓ ఉద్యోగి రెస్ట్ రూమ్ వైపు వస్తుండగా... అక్కడ ఓ పాము బుసలు కొట్టడంతో వెంటనే సిబ్బంది స్నేక్ క్యాచర్ కిరణ్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆయన అక్కడకు చేరుకుని పామును చాకచాక్యంగా పట్టుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో కార్యాలయం సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. తహసీల్దార్ రెండు రోజులు సెలవు పెట్టారని, ఆయన విధుల్లో ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని సిబ్బంది అంటున్నారు.

ఉడా కాలనీలో అన్నసమారాధన



వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



విజయ గణపతిని దర్శించుకుంటున్న భక్తులు

మర్రిపాలెం : మాధవధార ఉడా కాలనీ శ్రీ లక్ష్మీగణపతి ఆలయం ప్రాంగణంలో బుధవారం మహా అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ స్వామిని దర్శించుకుని అన్నసమారాధన ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రసాదం స్వీకరించారు.

మురళీనగర్ : బాలబాను విద్యాలయంలో విజయ గణపతికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు, కాలనీవాసులకు అన్నదానం చేశారు. బాల బాను విద్యాలయం కరస్పాండెంట్ బి.ఆర్.కె.రాజు దంపతులు, ప్రిన్సిపాల్ ఎస్వీ శ్రీ దంపతులు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.

ఉత్సాహంగా వినాయకుని అనుపోత్సవం



'సే నో టూ డ్రగ్స్' అంటూ విగ్రహాలతో విద్యార్థులు



ఊరేగింపులో గణేష్‌నగర్ యూత్ సభ్యులు

సీతంపేట : గణేష్ నగర్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక సీతంపేట గణేష్‌నగర్‌లో నిర్వహిస్తున్న వినాయక ద్వాదశ నవరాత్రి మహోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. యూత్ అధ్యక్షుడు ఉప్పాడ సన్నీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆకర్షణగా వినాయకుడి నిమజ్జనం

మర్రిపాలెం: వినాయక డ్రగ్స్ అడిక్షన్ సెంటర్ పేరిట తాటిచెట్లపాలెంలో నిర్వహించిన సంబరాలు బుధవారంతో ముగిశాయి. డ్రగ్స్‌కు బానిసలు కావొద్దని అవగాహన కల్పించేలా తీర్చిదిద్దిన మండపం ఆకట్టుకుంది. విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు తోటగురువు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రామకృష్ణ మూషిక ప్రతిమలు అందజేసినట్టు పీలా హరిప్రసాద్ తెలిపారు.

28న బహిరంగ వేలం

కంచరపాలెం : జీవీఎంసీ జోన్ – 5 పరిధిలో గల 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు సంబంధించి ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్లు పక్కన మార్కెట్లకు ఈ నెల 28న శనివారం జ్ఞానాపురంలో గల జోనల్ – 5 కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ తెలిపారు. 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణ నంబర్లు 8, 22, 24, 48, 52, 54, 44, 55, 56, 57, 58, సంజీవయ్య కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలు 1, 2, అశోక్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో రెండో నంబరు దుకాణం, త్రినాథపురం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకటో నంబరు దుకాణానికి మూడు సంవత్సరాల కాల పరిమితి, జీవీఎంసీ 51వ వార్డు మాధవధార మాధవస్వామి కల్యాణ మండపానికి మూడు సంవత్సరాల కాల పరిమితి, కంచరపాలెం, గుల్లలపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో రోడ్డు సైడ్ దుకాణాలకు ఒక సంవత్సర కాల పరిమితితో వేలం నిర్వహించాలని నిర్ణయించారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని, ఆధార్, పాన్‌కార్డ్ సమర్పించి, డీడీ రూపంలో మాత్రమే ధరావత్తు సొమ్ము చెల్లించాలని ఆయన కోరారు.

నరసింహనగర్ రైతు బజార్ ఖాళీ



ఖాళీగా దర్శనమిస్తున్న నరసింహనగర్ రైతుబజార్



రైతులతో మాట్లాడుతున్న ఏడీ యాసిన్

సీతంపేట : నరసింహనగర్ రైతు బజార్ బుధవారం ఖాళీగా దర్శనమిచ్చింది. రైతులు రాకపోవడంతో కూరగాయలు లేక బజార్ వెలవెలబోయింది. గత ప్రభుత్వం రైతు బజార్‌లో రైతులకు వారానికి ఒక రోజు సెలవు అమలు చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారానికి ఒక రోజు సెలవును రద్దు చేసింది. వారంలో ఏడు రోజులూ రైతుబజార్లకు రైతులు రావాల్సిందేనని మార్కెటింగ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ప్రతీ బుధవారం నరసింహనగర్ రైతుబజార్‌కు సెలవు కాగా, చాలా రోజుల తర్వాత ఈ బుధవారం తెరుచుకుంది. కానీ రైతులు మాత్రం ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోలేదు. ఎప్పటిలా సెలవు తీసుకోవడంతో బజారు ఖాళీగా దర్శనమిచ్చింది. బజార్‌లో మొత్తం 177 మంది రైతులు ఉండగా, బుధవారం కేవలం 12 మంది మాత్రమే హాజరయ్యారు. మార్కెటింగ్ శాఖ ఏడీ ఎస్‌కే యాసిన్ బుధవారం నరసింహనగర్ రైతుబజార్‌ను సందర్శించారు. ఆయనతో బజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు మాట్లాడుతూ ప్రతీ బుధవారం సెలవు కావాలని 123 మంది రైతులు ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజుకు వినతిపత్రం ఇచ్చినట్టు తెలిపారు.

పౌర రక్షణ దళం సేవలు ఉపయుక్తం

ఉత్సాహంగా సివిల్ డిఫెన్స్ వలంటీర్ల పాసింగ్ పరేడ్



క్షతగాత్రులకు ప్రథమ చికిత్స ఏవిధంగా అందించాలో వివరిస్తున్న వలంటీర్లు



ఫైర్ ఎగ్జిస్టింగ్ ట్యాంకుల పనితీరు వివరిస్తున్న వలంటీర్



మంటలు అదుపు చేస్తున్న వలంటీర్

సీతంపేట : విపత్తులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు సివిల్ డిఫెన్స్ వలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందించడానికి సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సూచించారు. శాంతిపురంలో గల పౌర రక్షణ సంస్థలో బుధవారం 229వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణ పూర్తి చేసుకున్న 57 మంది వలంటీర్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో పౌరరక్షణ దళం సేవలు చాలా ఉపయుక్తమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించి పౌర రక్షణలో మరింత మందిని భాగస్వామ్యులను చేయాలని సూచించారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. సివిల్ డిఫెన్స్ కంట్రోలర్ కె.పద్మలత మాట్లాడుతూ వార్డెన్ సర్వీస్, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ అండ్ ఫైర్ ఫైటింగ్ అంశాల్లో నిపుణులతో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎంహెచ్‌వో పి.రామారావు, ఫైర్ ఆఫీసర్ ఎస్.దేముళ్లు, వైద్య సిబ్బంది, అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బురపర్చిన విన్యాసాలు

పరేడ్‌లో భాగంగా వలంటీర్లు ప్రదర్శించిన పలు విన్యాసాలు అబ్బురపరిచాయి. ప్రమాద ఘంటిక మోగగానే అంతా అప్రమత్తమై ఎదుర్కోవడం, ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను రక్షించడం, మంటలను అదుపుచేయడం, ఎత్తైన భవనాల నుంచి క్షతగాత్రులను, మృతదేహాలను తాళ్ల సాయంతో కిందకు దించడం, విపత్తు సమయంలో అవసరమైన మార్చురీ, షాక్, స్నేక్‌బైట్, ఫ్రాక్చర్, రక్తస్రావం, కృత్రిమ శ్వాస, ప్రథమ చికిత్స, వైర్‌లెస్ కమ్యూనికేషన్ అంశాలను వలంటీర్లు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.